రా లి న పు వ్వు లు

ధుప్ ధుప్ ధుప్, ఏమిటది ? పరుగు. పరుగిడుతున్న పాదాల చప్పుడు. అడుగులు యింట్లోకి పరిగెడుతున్నాయి.

అద్దంలో చూచుకుంటూ, తనకి తానే చిరునవ్వు నవ్వుకుంటూన్న మురళి వెనక్కి తిరిగి చూడబోయాడు. అద్దంప్రక్కనే ఒయ్యారంగా పడుకున్న కమలాలంకృత శకుంతలబొమ్మ అతని కళ్ళకి కొట్టినట్టి యింది. చటుక్కున ఆగిపోయాడు. ఔను. ఆ రోజుల్లో యిప్పటిలాంటి చట్టాలు లేవు. మన మిత్రు లన్నవన్నీ నిజమే. ఈరోజుల్లో వుడుపులన్నీ ఒళ్ళంతా కప్పుతాయి. ఆ రోజుల్లో చూడు. ఆ శకుంతల సౌందర్యం కృత్రిమ మర్యాదలకి లొంగలేదు. ఆ రోజుల్లో స్వేచ్ఛావిహారాలూ అంతే. ఈ వివాహాలూ, ఈ బంధాలూ వట్టి మానవనిర్మితం ! నిజమే ! తన మిత్రు లందరూ అప్పటివరకూ చేసివెళ్ళిన హితోపదేశాలన్నీ తలలో ఒక్కసారి ద్విగుణీకృత స్వరూపంతో తిరిగినయి. ఆ ఆలోచనలతో పర్ధ్యానంగా, ఇంట్లోకి—అడుగుల చప్పుడువేపు—తిరిగాడు వెనక్కి.

గాలిలో యెగురుతూన్న పవిటచెంగు కొస చటుక్కున కనిపించి లోపలికి యెగిరిపోయింది. పరిగెడుతూన్న కాళ్ళ చప్పుడుతోపాటు, మురళి ఒక్కసారి దిగ్భ్రమ చెందాడు. నిద్రలోనించి లేచినట్టుగా ఒక్కసారి చైతన్యం కలిగింది.

ఆడపిల్ల యెవ్వరో పరిగెత్తింది లోపలికి ! ఎవరై యుంటారు ? లోపల నౌకర్లు వున్నారు. నౌకర్లకోసమైతే అల్లా సింహద్వారంలోనించి

పరిగెత్తరు. అందులోనూ, ఆ చీరకొంగు—నౌకర్లదికాదు—పల్చగా, నాగరికంగా చటుక్కున కంట్లో పడ్డది.

తిరిగి చెవుల్లో గింగురుమంటూ జ్ఞాపకం వచ్చినయి, దినమంతా మిత్రులు దృఢపరచిన విషయాలన్నీ. ఎంత సంతోషంగా గడిపారు. సంభాషణలు అక్కడ చెవిని పడకుండా పగలంతా గడిపారు. పసిడి కాంతులు చిమ్మాడు సూర్యుడు. అర్థంలేని గాలు లేవో పువ్వుల పొదల మీదనించి వీచినయి. శంకరం అన్నాడు: "స్త్రీలకీ, పురుషులకీ మధ్య వుండే బాంధవ్యం కేవలం భౌతికం." రావు: "ప్రేమ అనేది మిథ్య. వట్టి మృగతృష్ణ." దాసు అన్నాడు: "వివాహం మనుష్యుల వీలునీ అవకాశాలనీ అనుసరించింది మాత్రమే." అందరూ అన్నది: జీవితమూ, అవకాశాలూ, మరీ తనలాంటి ధనికుడికి ఒక్కసారే దేవు డిస్తాడనీ, అవి చెయ్యి జార్చుకోకూడదనీ. అదే నిజం. అన్నట్టు పరిగెత్తితే కాళ్ళ చప్పుడు మళ్ళా ఎక్కువైంది. ఈసారి తిరిగివస్తున్నాయి అడుగులు. తన గది గుమ్మంముందరినించే బయటకెళ్ళాలి యెవరైనా. అదిగో! ఎవరు? అరె! రాణి!

ఇన్నాళ్లూ ఎప్పుడూ తను రాణిని పలుకరించలేదు. ఇదిగో యిప్పుడు అందుబాటులో వుంది. రాణి అంటే తనకి యెప్పుడూ అదొకవిధమైన యిష్టం. కనురెప్పపాటులో తనకి రాణిమీదవున్న గత భౌతిక తృష్ణలన్నీ ఒక్కసారి విజృంభించినయి.

"రాణీ! ఇదిగో, నిన్నే! ఒక్కసారి ఆగు!"

అడుగులు ఒక్కసారి చటుక్కున ఆగిపోయినయి. మురళినిచూచి జలజారాణి ఆశ్చర్యంతో నిర్ఘాంతపోయింది ఒక్క క్షణం. తెప్పరిల్లి "సుశీలకోసం వచ్చానండీ" అంది కొంచంగా తల వంచుకునే.

"సుశీల లేదే! లేదు. ఊరెళ్ళింది, అక్కయ్యతో" చాలా సడన్‌గా అన్నాడు మురళి చిరునవ్వుతో - ఆహ్వానసూచనగా - ద్వారంలో ఒక ప్రక్కగా నుంచుని.

"అదేనండీ. పనివాళ్లు చెప్పారు. అందుకనే తిరిగి వెళ్ళిపోతున్నాను" అంది రాణి కనీకనిపించని వెళ్ళే కదలికతో.

"అబ్బెబ్బే ఎందుకూ ? నేను లేనూ ? ఇలా రండి లోపలికి. ఏమి టసలు పని ? వాట్ ఏ ఫూల్ ఐ యామ్ ! పనేమిటేమిటి ? ఎప్పుడూ కాలేజీ కబుర్లవ్వి చెప్పుకుంటూనే వుంటారుగా మీ రిద్దరూ, నాకు తెలి యదా ?" అన్నాడు ఏకధాటిగా.

"లేదండీ, నేను వెళ్ళాలి. చాలా అవసరం" అంది రాణి, కాస్త దృఢంగా.

"వెళుదురుగాని, ఒక్క నిమిషం కూచోండి" అంటూ తన గది లోపలికి అడుగులువేసి కుర్చీ లాగాడు మురళి.

"ఊహు ! సుశీలతో అర్జంటుపనుండి వచ్చాను. చాలా తొంద రగా వెళ్ళాలి" అంది రాణి కాస్త బాధగా.

మురళికి రాణి స్వరంలో బాధ కనిపించలేదు. రాణి సర్వాంగ సౌందర్యం ఒక్కటే అతని కళ్ళల్లో కనిపించింది.

"పనేమిటి చెప్పండి, నే నున్నానుగా. నాతో చెప్పండి"అన్నాడు. రాణి నిశ్చలంగా నిలబడేవుంది. "నేను వినదగనా ? సుశీల ఒకటీ నే నొకటీ అనుకోకండి" అన్నాడు మురళి, మళ్ళా చిరునవ్వుతో—"ఒక్క క్షణం కూచోండి" అంటూ, తనూ ఒక కుర్చీలో కూచున్నాడు, ఎదు రుగావున్న సోఫా రాణీకి చూపిస్తూ.

"నేను వెళ్ళాలండీ. కాని మీరు కూచోమంటే కూచుంటాను" రాణి స్వరం మధురంగా, మృదువుగా, నమ్రతగా మురళి చెవుల్లో పడ్డది.

ఆడపిల్ల స్వరం ! ఆడపిల్ల లందరూ అదే అణుకువతో మాట్లా డుతారనుకుంటాను. ఆ అణుకువ, అనాదిగా సృష్టిలో యే నాగరికతకీ,

ఏ సంస్కారానికీ లోబడకుండా, రవ్వంతైనా అప్పుడప్పుడూ తలత్తే పురుషహృదయానికి యెంత ఆకర్షణీయంగావుంది.

రాణి మెల్లిగా లోపలికి అడుగువేసింది. సోఫాలో అంచున కూచుంది.

ఇంతకీ 'ధనమూల మిదం జగత్' అన్నాడు. తాను ధనికుడు. తన కసాధ్య మేముంది ? ఇదేగా యెప్పుడూ తన మిత్రబృందమంతా వక్కాణించేదీ, తానూ తన జీవితంలో చూచిందిన్నీ.

"ఇప్పుడు చెప్పండి, చెప్పవలసింది" అన్నాడు మురళి, ప్రక్క బంగళాలో తన గుజరాతీ మిత్రుడు దయాభాయి తన చొక్కామీద మ్యధాహ్నం పోసివెళ్ళిన హోళీపండుగ వసంతం మచ్చ చేతితో తడుము కుంటూ.

"మరేమీలేదండీ ! సుశీలని కాస్త పైకం అప్పుడిగాను. అవసరమైతే అడగమంది" అంది రాణి.

"ఓస్ ! దానికేనా యింత గందరగోళంచేశారు ! ఎంతకావాలండీ, అసలు ?" అన్నాడు చిరునవ్వుతో.

"మహారాజులా తీసుకో" అంటూ లేచివెళ్ళి ప్రక్కనున్న టేబిల్ డ్రాయరు తెరిచాడు.

"మా నాన్నగారికి ప్రాణంమీదికి కొచ్చిందండీ. ఆయనకి అప్పు త్రంటే భయం, నమ్మకమూ లేదు. పైగా నే నాయనని చూచుకుంటూండాలి. నాకిం కెవ్వరూ బంధువులు లేరు" అంటోంది రాణి దీనంగా.

మురళి పైకం లెక్కపెట్టి ఒక కవరులో పెడుతూ "ఇవిగో మూడువందలు. చాలా ?" అంటూ చిరునవ్వుతో చేతి కివ్వబోయాడు.

అతనికోసం రాణి హృదయం పొంగుకొచ్చింది. అబ్బ ! ఎంత మంచివాడు మురళి ! ఇన్నాళ్లూ తను అతనిని యెంత ప్రేమించిందో అతనితో చెప్పెయ్యాలనిపించింది. కానీ, దానికి ధైర్యంలేదు. పైగా యిప్పటి పరిస్థితి ప్రాణాపద. తన ప్రేమ అతనికి తెలియదుగా ! మరి అవేమిటో—తను అపుడపుడూ మురళి కళ్ళల్లో చూచిన ఆశలు, అయాచితంగా—అప్రయత్నంగా తన కంటబడ్డవి. ఐనా సాంఘికంగా మురళి తనవాడు కాదు.

"ఈ అప్పు తొందలోనే తీర్చేస్తాను" అంది రాణి.

"నాన్ సెన్స్ !" అన్నాడు మురళి.

"ఇంకా కావాలా ?" అడిగాడు మురళి, రాణి కెదురుగా నుంచుని.

రాణి సంతోషానికి మేరలేకపోయింది. తన తండ్రీ, తానూ కలసి గడపగలిగిన దివ్య భవిష్యత్ కళ్ళముందు తిరిగింది. అందులోనూ, ఎవ్వరు తన తండ్రికి ప్రాణభిక్ష పెట్టేది ? తను అంతరాత్మలో రెండో జీవికి తెలియకుండా నిలుపుకున్న వేల్పు యీవులిస్తున్నది. రాణి డబ్బందుకుని పర్సులో పెట్టుకుంది, డాక్టరు ప్రిస్క్రిప్షన్‌తోపాటు.

వెళ్ళడానికి సిద్ధంగా, తలెత్తి అతనిని చూచింది. అదేమిటి ? అతని ముఖం అదోమాదిరిగా, భయంకరంగా మారింది ? ఇదివరకెన్నడూ అతనిని అల్లా చూడలేదు. రాణికి భయంవేసింది.

"మీరు చేసిన సహాయం మరువలేను" అంది రాణి భయం భయంగా, లేచి నుంచుంటూ.

"మా నాన్నగారికి యీ ఇంజెక్షన్ ఒక్కటే ఆఖరుచాన్స్ అన్నాడు డాక్టరు. ఇంతవరకు యింట్లో వున్నవన్నీ అమ్మేశాను. ఈ నెల మా నాన్నగారి పెన్షన్‌కూడా అయిపోయింది. అందుకని గుండె లవిసిపోకుంటూ పరుగెత్తుకొచ్చాను" అంది రాణి.

"ఇదిగో, రాణీ! అక్కా, సుశీలా యింకా ఒక నెలవరకూ రారు. నేను ఒంటరిగానే వుంటాను. మరీ నీ వింత చెబుతున్నావుగనుక, మీ నాన్నగారిని చూచుకునే రేపు రా. పరవాలేదు. నేను నీకోసం చూస్తూంటాను. ఏం? అర్థమయిందా? నీ కింకా సహాయం చెయ్యమన్నా చేస్తాను" అన్నాడు కొంచం రాజకీయంతో.

"ఆఁ! నేనా! రేపా! అబ్బా—ఎంత ఘోరం! ఎంత పాపం?" అంది రాణి, గుండెలు తల్లడిల్లిపోకుంటూ.

"ఆలోచించుకో!" అన్నాడు మురళి, నిర్లక్ష్యంగా. ఈ గత ఐదునిమిషాలలో యీ డబ్బుతో తన తండ్రిని బ్రతికించుకోవాలని కట్టిన మేడలు గాలిలో కూలిపోతున్నాయా! ఊఁహు! తన తండ్రి బ్రతకాలి. మరణశయ్యమీదవున్న తండ్రి నిస్సహాయత, నిస్పృహ ఒక్కసారి స్ఫురణ కొచ్చాయి. ప్రపంచంలో తనకి సర్వస్వమూ అనుకున్న తండ్రి తన విశ్వమంతా వ్యాపించాడు. మరేదీ కనిపించలేదు. నాన్న తనమీద చూపిన ప్రేమానురాగాలకి ప్రతిఫలం తను యివ్వలేదు. కనీసం ఒకరి కొకరై కొన్నాళ్ళైనా బ్రతకాలి యింకా. ఏమైనాసరే, తండ్రిని బ్రతికించుకోవాలి.

పచారుచేస్తున్న మురళి ఆగి తనవేపు చూచాడు, లైట్ స్విచ్ మీద చేయివేస్తూ.

రాణికి కాళ్ళక్రింద భూమి తిరిగినట్టయింది. కళ్ళు చీకట్లు క్రమ్ముతున్నాయి. ఈ లక్షణాలు యిదివరకు కొన్నిసార్లు వచ్చినయి. ఈనాటి సాయంత్రం డాక్టరు ఆమాట చెప్పగానే అల్లాగే చీకట్లు క్రమ్మినాయి. బలవంతంమీద నిభాయించుకుందిగాని, తన యీ మూర్ఛవల్లనేగా నాన్న అంత బెంగపెట్టుకున్నారు. బాగుచెయ్యడానికి నాన్నగారికి అందుబాటులో వున్న యే డాక్టరువల్లా కాకపోయె. పెద్దదానవైతే దానంతటదే పోతుం

దన్నారు. తట్టుకోలేని కష్టం వచ్చినపుడల్లా వస్తోంది యీ మూర్ఛ. రాణి కీసారి యీ మూర్ఛ నిరోధించాలనికూడా ఆశ లేకపోయింది—శక్తిలేదు.

"నాన్న బ్రతకాలిగా, ఈ డబ్బు కావాలి" అనిమాత్రం అనగలిగింది, తనకి తానే చెప్పుకుంటున్నట్టు.

కనురెప్పపాటులో చీకట్లు యెక్కడపై మైకం క్రమ్ముకొచ్చింది. అదిగో, ఏమిటో అయిపోతోంది! అరె! అరెరె! చీకటి! అయోమయం! కళ్లు మూసుకుపోయినయి. నుంచోలేననిపించింది రాణికి.

రాణికి స్పృహవచ్చేటప్పటికి వాళ్ళ ప్రక్కింటావిడా, ఆవిడ పిల్లలూ చుట్టూచేరి పరిచర్యలు చేస్తున్నారు.

"మా నాన్న యెలావున్నారు పిన్నిగారూ?" అని గాబరాగా లేవబోయింది. చేతిక్రింద పర్సులోనుంచి కవరు సగం బైటికొచ్చి తగిలింది. గడచిన ఘడియలూ, అనుభవాలూ జ్ఞాపకం వచ్చినయి, ఏవో స్వప్నంలో లాగు. బలవంతాన తెప్పరిల్లి మనస్సు స్వాధీనపరుచుకుని లోపలికి పరిగెత్తింది. తండ్రి చెయ్యి పట్టుకుని ప్రక్కింటాయన తండ్రిముఖంలోకి నిస్పృహతో చూస్తున్నాడు.

"బాబాయిగారూ! నాకు మీరు యెంతో సహాయం చేశారు. ఈ డబ్బుతో యీ మందుకూడా తెచ్చిపెట్టండి. వచ్చేటప్పుడు డాక్టర్నికూడా పిల్చుకొద్దురుగాని" అంది, గాబరాగా పర్సు తెరుస్తూ.

ఆయన వెంటనే "అక్కర్లేదమ్మా. ఏ మందు అవసరంలేదిహను. ధైర్యంగా వుండు" అని గంభీరస్వరంతో, నిమ్మళంగా అన్నాడు.

తరువాత యేమైందీ; ఏదో జన్మలో జరిగిన ఘట్టంలా అనిపించింది రాణికి.

ఒక నెలరోజులు మురళి రాణికోసం యెదురుచూచాడు, తిరిగి వస్తుందని. రాణి రాలేదు.

ఎందుకూ పనికిరాని ఒక కుర్రది ! ఇంతగల భాగ్యవంతుణ్ణి. తనని యిట్టే మోసం చేసిందని ఆశ్చర్యపోయాడు మురళి. అలా మోసపోయి నందుకు తనమీద తనకే కోపంవచ్చింది. రాణిమాట జ్ఞాపకంవస్తేనే ఒళ్లు తెలియనంత కోపంవచ్చేది. స్త్రీ అంటేనే ద్రోహి- అనే నిశ్చయంతో మురళి తిరిగి పేకాటలతో, మిత్రబృందాలతో, తన మామూలు విలాసాలతో జీవితం గడుపుతున్నాడు.

ఒకటిన్నర సంవత్సరం కావచ్చింది. అక్కయ్య, మురళికి సుశీలనిచ్చి వివాహంచెయ్యడానికి ప్రయత్నాలారంభించింది. మురళికి వివాహంమీద నమ్మకంలేదు. పైగా స్త్రీ జాతంటేనే ఒక ద్వేషం యేర్పడ్డది. అందులోనూ సుశీల తనకి చెల్లెలులాగా పెరిగింది.

ఒకనాటి సాయంత్రం చీకట్లలుముకుంటున్నాయి. అక్కయ్యా, సుశీలా సినిమాకి వెళ్ళారు. మురళి ఒక్కడే మిత్రులకోసం యెదురు చూస్తూ, సిగరెట్టు పీలుస్తూ పేషన్సు ఆడుకుంటూ కూచున్నాడు. చటుక్కున తలుపు చప్పుడయింది. మురళి వెనక్కి తిరిగి చూచాడు. రాణి ! చిక్కిపోయింది. కాని, లావణ్యమూ, ఆకర్షణా యేమీ తగ్గలేదు. మురళి పరమానందభరితు డయ్యాడు.

చిరునవ్వుతో ఆహ్వానపూర్వకంగా లేచాడు. "రా ! కూచో ! ఇన్నాళ్ళకి జ్ఞాపకం వచ్చానన్నమాట. నే ననుకుంటూనేవున్నా—లోలోపల, నీవు మంచిదానవని. ఎన్నాళ్ళ కెన్నాళ్ళకి !" అన్నాడు గుక్క తిప్పకుండా.

"మా నాన్నగారు పోయారండీ" అంది రాణి, గుమ్మంలో నిలబడి.

"ఔనాను. అన్నీ విన్నాను. మళ్ళా నీకు నెమ్మదిపడటాని కింత కాలం పట్టిందన్నమాట" అన్నాడు మురళి.

"మా అక్కా, సుశీలా బైట కెళ్ళారు, రా, కూచో!" అన్నాడు మళ్ళా.

"నేను వాళ్ళకోసం రాలేదండి. మీకోసమే వచ్చాను" అంది రాణి.

"నిజం! నిజంగానా!" అన్నాడు మురళి, సంతోషంతో. నుంచునే వున్నావేం అంటూ కుర్చీ చూపించాడు.

అవేవీ వినిపించుకోకుండా రాణి "ఇంతకు ముందరే వచ్చి వుందును. డబ్బు సర్దుబాటు కాలేదు" అంది.

"అలాగని వ్రాస్తే నేను పంపుదునుగా. నీ అడ్రసు నాకు తెలియకపోయె. డబ్బు కావాలా!" అన్నాడు మురళి, ఇంకా నవ్వుముఖంతో.

"మీకు నేను మూడువందలరూపాయలు బాకీ కదూ? స్వయంగా, కృతజ్ఞతతో అది చెల్లించడాని కొచ్చాను" అందామె.

"చచ! నాన్‌సెన్స్. ఏమిటా మాటలు? నాకు బాకీ యేమిటి?" అన్నాడు స్నేహపూర్వకంగా.

"మీరు నా కిచ్చిన డబ్బు: మా నాన్నగారి అంత్యక్రియల కొచ్చింది. ఆ డబ్బే లేకపోతే నే నేమైయుందునో వూహించుకోలేక పోతున్నాను" అంది రాణి, తలుపు ఒక చేతితో పట్టుకునుంచుని.

"అదెంతభాగ్యం" చిరునవ్వుతో మురళి తేల్చేశాడు.

"ఆ డబ్బు మీ కెక్కువకాదు. నా కెక్కువే గా: ఇప్పుడు నేనేదో గుమస్తాపని చేస్తున్నాను ఆఫీసులో. అందువల్ల మీ రీ డబ్బు దయతో తిరిగి అందుకుంటే నేను వెళతాను" అంది రాణి, ఒక్క అడుగు లోపలికేస్తూ.

"ఏమిటీ: ఆ డబ్బు నాకు తిరిగియిస్తున్నావా!"

"అవును. బాకీ చెల్లిస్తున్నాను."

"నేను నీ కది అప్పుగా యివ్వలేదు. ఆ ఏర్పాటు వేరు"అన్నాడు మురళి, కాస్త కటువుగా.

"నేను అప్పుగానే అడిగాను" అంది రాణి దృఢంగా.

మురళి ముఖం కాస్త యెర్రబారింది. తమకి ధనమంటే గౌరవం మెండే. కాని, మూడువందల రూపాయలు యే సంస్థకైనా విరాళమిచ్చి మరుక్షణం మరచిపోగలడు. ఇపు డీ బీదపిల్ల తనకిచ్చిన డబ్బు తిరిగి తన చేతిలోనుంచి తీసుకోమంటోంది. ఎంత దెబ్బ తన హోదాకి!

రాణి ఒక్క అడుగు లోపలికేసి, అతని గోడమేజామీద ఒక పెద్ద కవరు చటుక్కున పెట్టేసి, ఒక్క క్షణంలో వెనక్కి తిరిగి ద్వారంలోనుంచి ఒక్క అంగలో బైట కెళ్ళిపోయింది.

మురళి తన ఆశ్చర్యంలోనుంచి తేరుకునేటప్పటికి ఒక్క అర నిమిషం పట్టింది. చేతికొచ్చిన పక్షి జారిపోయినట్టు, రాణి కనిపించి మటుమాయమైందని మాత్రం అర్థమైం దతనికి. గాబరాగా ఒక్క పరుగున బైట కొచ్చాడు. రోడ్డువరకూ పారచూచాడు. రాణి జాడ యెక్కడా లేదు. కొంచం గట్టిగానే "రాణీ! రాణీ!" అని పిలిచాడు. జవాబు లేదు. చేసేదేమీలేక తిరిగి గదిలోకి వచ్చాడు. రాణి పెట్టివెళ్ళిన కవరు తీశాడు. చాలా బరువుగావుంది. ఆశ్చర్యంగా విప్పాడది.

దానిలో మూడువందల రూపాయలనోట్లూ, ఒక పెద్ద ఫొటోన్నా వున్నాయి. ఆ ఫొటో కంతటికీ తెల్లటి కాయితం అంటించి వుంది. మధ్యన ఆ కాయితం కోలగా కత్తిరించివేసి వుంది. ఆ ఖాళీమేరలో వున్నది, తన ఆకృతి నడుంవరకూ. ఆ కాయితం ఆదుర్దాగా వూడదీశాడు.

అది తన కుటుంబపు ఫొటో. అందులో అక్కా, సుశీలా అందరూ వున్నారు. బహుశా సుశీల యీ ఫొటోను రాణి కిచ్చివుంటుంది. దానిలో తన ఫొటోమాత్రమే కనిపించేటట్టు కాయితం కత్తిరించి అంటించివేసింది రాణి.

ఎందుకో: దాని అర్థం: మురళి హృదయంలో పట్టలేని సంతోషం పొంగుకొచ్చింది. రాణి తనని ప్రేమిస్తోంది.

ఈ ఫొటోతోపాటు కవరులో యీ యెండిపోయిన జొగడపూల దండ యెక్కడిది ?

ఔను—జ్ఞాపకంవచ్చింది. ఒకటిన్నర సంవత్సరాలక్రితం—ఒక నాడు తన కాంపౌండులోవున్న జొగడచెట్టుక్రింద రాలిన పువ్వులు ఏరుకుంటూంటే స్నేహితుడొకడు వచ్చాడు. "ఏమిట్రా, ఎపుడుచూచినా ఆ రాలి పడిపోయిన పువ్వులన్నీ ఆడపిల్లలా యేరుకుంటావు" అన్నాడతను. "రాలిపడ్డ పువ్వులైతేమాత్రం యెంత సువాసన!" అన్నాడు మురళి. "అవి యిట్టె వాడిపోయి యెరుపెక్కిపోతాయిరా" అన్నాడతను. "వాడినా వాసన పోదురా" అంటూ వెనక్కి తిరిగి చూచాడు మురళి. సుశీల గదిలోనుంచి కిటికీ పట్టుకుని తదేకదృష్టితో తనని చూస్తూ నుంచునివుంది రాణి. అతను చూడగానే చటుక్కున వెనక్కి తిరిగి గదిలోపలికి వెళ్ళిపోయింది. సూటూ, పై కట్టుకుని వంగి పువ్వులు ఏరుకోడం యెక్కడ చూచిపోయిందో యీ రాణి అని సిగ్గుపడిపోయాడు మురళి. ఐనా నిభాయించుకుని యెప్పటిలా సుశీలగదిలోకివెళ్ళి దండగుచ్చియివ్వమని స్నేహితుడితో బయట కెళ్ళిపోయాడు. తిరిగి వచ్చిన తరువాత "నాకు కాస్త పనివుండి రాణీని గుచ్చమన్నాను. ఇప్పు డెంత వెతికినా దండ కనబడటంలేదు. అది యెక్కడైనా పారేసిందో, నీ గదిలో పెట్టమని పనివాడి కిచ్చిందో, మామయ్యా" అంది సుశీల. "పోనీలే" అన్నాడు మురళి నిద్రకళ్ళతో.

ఈ వేళ తెలిసింది. ఇన్నాళ్ళూ యీ పటానికి తను ఏరిన పువ్వులు దండగుచ్చి వేసి పూజిస్తోంది రాణీ. తను యీ రాణీకి ఆరాధ్యదైవం. అతనిని ఒక స్త్రీ హృదయపూర్వకంగా ప్రేమిస్తోంది—ప్రేమ. అది ఎంత

క్రొత్త అనుభవం. ఎంత అమూల్యం. ఈ ప్రేమబలంవల్లనే గరుడుడూ సావిత్రీ తమ ప్రియులను మృత్యువాతనుంచి తెచ్చుకున్నారు. మానవాళిలో కొద్దిగానో గొప్పగానో సుషుప్తావస్థలో మునిగివుండే అనిర్వచనీయమైన స్త్రీ-పురుష పరస్పర ప్రేమానుబంధాలు, మురళిలో ఒక్కసారి మేల్కొని తలలెత్తినయి. ఎన్న డెరుగని మాతృవాత్సల్యంతో రాణిని కాపాడాలను కున్నాడు. జీవితం ప్రతి ఘడియా రాణి సాన్నిధ్యంలో గడపాలన్న మధురవాంఛ కలిగింది మురళికి.

తన చేతిలోవున్న కవరు తిరిగి బల్లమీద పెట్టాడు. దానిలోనుంచి నోట్లు సగం బయటకు కనబడుతూన్నాయి. డబ్బు అతీతమైన విలువ గలదని నమ్మే తనకి రాణి డబ్బు తిరిగి యిచ్చేసింది. తనుచేసే ధర్మం రాణి నిరాకరించింది. డబ్బుమీద యింత నిర్లక్ష్యంచూపే వ్యక్తిని మురళి యింతవర కెన్నడూ చూచివుండలేదు. ఉద్యోగంచేసి, ఏ వుపవాసాలు చేసో తెచ్చి యీ అప్పు తన ముఖంమీద పారేసింది. ఇంత ఖచ్చితంగల నడవడి, ఇంత గొప్పతనం వున్న జీవితం, యింత తీవిగల నడత, మురళిని తబ్బిబ్బుచేశాయి. తన విలువలూ, తన బుద్ధులూ తన దృష్టిలో యెంతో నీచంగా కనిపించాయి. తననినిగూర్చి తానే సిగ్గుపడ్డాడు. రాణి పాదసేవ చేయడానికికూడా అతనికి అర్హత లేదనిపించింది.

జీవితంలో క్రొత్త వుత్సాహం కలిగింది. ఆ రాత్రి నిద్ర సరిగా పట్టలేదు. ఘడియ ఘడియా నూతనంగా కనిపించింది. ఏదో వుత్తేజం చుట్టూ ఆవరించిం దతనిని. తన రాణి! రాణి తనది! అనుక్షణమూ రాణీతో కలిసి బ్రతకాలి! రాణిని—తనరాణీని గౌరవంతో ఆదరించాలి. రాణీ ఆదరణ తను పొందాలి.

ఉదయాన రాణి పాతయింటికి తన పనివాణ్ణి రాముణ్ణి పంపాడు. వాడు యిదివరకు తెచ్చిన సమాధానమే తెచ్చాడు. ఆమె అడ్రసు యిరుగు-పొరుగువాళ్ళకి తెలియదు.

రాణి దగ్గరలేని జీవితం వ్యర్థం-దుర్భరం. రాణికోసం వూరంతా వెతక నారంభించాడు మురళి. ప్రతి ఆఫీసుచుట్టూ, గుడిచుట్టూ తిరిగినట్టు తిరగనారంభించాడు. ఆఫీసులు వదిలేవేళకి బయటికొచ్చేవాళ్ళని శ్రద్ధగా పరీక్షిస్తూ దూరంగా నుంచునే వుండేవాడు. ధనికుడికి వచ్చే-పోయే ఆడ పిల్లల్ని చూస్తూ నుంచోడం మామూలు వ్యసనంక్రిందనే ప్రపంచం తీసుకుంది.

నెలలు గడిచినయి. మురళి అన్వేషణ మానలేదు. అహర్నిశలూ రాణి స్మరణతప్ప మరి యే విషయమూ అతనికి చొరలేదు. ఎప్పుడో రాణిని కలుసుకుని, రాణి ప్రేమని తను పొందాలన్న నిరీక్షణ ఒక్కటే అతనికి జీవితాశయమైపోయింది. కాని, రాణి జాడ యెక్కడా లేదు.

స్త్రీలనిగురించి చులకనగా మాట్లాడే మిత్రుల సంభాషణలు యీనాడతనికి హేయంగా కనిపించినయి. 'స్త్రీలు గౌరవనీయులు, వాంఛనీయులు' రాణి అటువంటిది.

ఊరంతా తిరిగి తిరిగి అలసి వచ్చి నుదుటిమీద చెయ్యిపెట్టుకుని గది కప్పుకేసి చూస్తూ, ఆలోచిస్తూ పడుకునేవాడు. ఒక్కొక్కప్పుడు నిరాశ యేర్పడుతూండేది. ఐనా రాణికోసం, ఆమె ప్రేమకోసం తన కుండే తీవ్రవాంఛలే భగవదాశీర్వాదా లనిపించింది మురళికి.

ఏదో క్రొత్తమిషన్లు చూడ్డానికి, తన మేనేజరు రవి చెప్పగా చెప్పగా ఒకనాటి సాయంత్రం తన పేపరు ఫ్యాక్టరీకి బయలుదేరాడు మురళి. ఈ మధ్య తనకైన అలవాటుప్రకారం కారు దూరంగా ఆపి నడిచి వస్తున్నాడు. ఆఫీసు వుద్యోగస్థు లందరూ బెలబెలమంటూ అప్పుడే బైటకొస్తున్నారు.

వాళ్ళలోవున్న ఆడపిల్లల్ని చూచి సగౌరవంగా మురళి వెనక్కి తగ్గాడు. వాళ్ళంతా రాణితరఫువాళ్లుగా కనిపించా రతనికి. వాళ్ళమధ్య అదెవరు ? రాణి ! బలవంతంమీద రాణీవేపు పరిగెట్టే తన కాళ్ళాపుకున్నాడు. "రాణీ !" గొంతు పొడారిపోయింది. మాట రాలేదు.

అలసిపోయిన ముఖంతో, ఒంటరిగా కాళ్ళీడ్చుకుంటూ వాళ్ళ మధ్యనుంచి వెళుతోంది. మురళి కడుపులో యేదో దేవినట్లయింది. తన రాణి ముఖంలో ఆ నిరాశారేఖలు తొలగించాలి. ఆనందం చూడాలి. తాను తన రాణి సుఖపడాలి. ఏకాకిలాగా తలవంచుకుని, ఏదో విచారభారం మోస్తున్నట్టుగా రోడ్డు మలుపు తిరిగింది రాణి.

సాయంత్రపు గాలిలో తన పై యెగిరి ముఖానికి కొట్టింది. చేతిలో వున్న సిగరెట్టు కొన కాలి, మన్నై వేళ్ళు కమిలినయి. దిగ్గున మతి వచ్చింది మురళికి. సిగరెట్టు పారేసి బూటుకాల్తో క్రింద నలిపేసి, కారెక్కి తిరిగి యింటికెళ్ళిపోయాడు తీరని సంతోషంతో.

"రాణీ ! రాణీ !" రాణి వెనక్కి తిరిగి చూచింది. రెండు గజాల దూరంలో మురళి నించుని వున్నాడు. రాణి విగ్రహంలా నిలబడిపోయింది. ఆఫీసువదలి వెళుతున్న జనం చాలామంది వెనక్కి తిరిగి చూచారు. మురళి సవినయంగా ఒక్క అడుగు ముందుకేస్తూ "రాణీ, నీతో ఒక్క పదినిమిషాలు మాట్లాడాలి చాలా ముఖ్యం" అన్నాడు.

ఎవరన్నా చూస్తే యిహను తలెత్తుకోలేనండి. అయినా నాతో ఏమిపని వుంది ? నన్ను పలుక రించకండీ" అంది రాణి, బ్రతిమాలినట్టు కాస్త ధృఢంగాకూడా.

అప్పుడే భోంచేసి, మనస్సు నెమ్మదిపర్చుకోడానికి ఏదో చదువుకోబోతోంది రాణి తన గదిలో. తలుపు చప్పుడయింది. అతిథులు అరుదైన రాణి ఆశ్చర్యంగా తలుపు తీసింది. మురళి గుమ్మంలో

మనోహరంగా నించుని వున్నాడు. ఇన్నాళ్ళూ తను దిగమ్రింగిన ప్రేమ ఒక్క-సారి వెల్లివిరిసికొని మురళికి స్వాగతమివ్వ బోయింది. రాణి నిభాయించుకుని సహజ సౌజన్యంతో "వస్తారా ? రండి, కూచోండి" అంది. మురళి ఒక్క అంగలో కుర్చీలోకి వచ్చాడు, అనందంతోనూ-తృప్తితోనూ. కూర్చోకముందే తన అరచెయ్యి గుప్పిడి విప్పాడు. కన్ను చెదిరేటట్టు రెండు పండినపండ్లు. "నీకు బొగడపండ్లు యిష్టమని సుశీల అంటూంటే విన్నాను. అరిచేతిలోనే పెట్టుకొచ్చాను. నా చేతివేడికి యింకా ముగ్గి బాగా రుచిస్తాయని!" అన్నాడు మురళి ఆప్యాయంగా. "అంటే, యింతదూరమూ ఒక్క చేతితోనే కారు నడుపుకొచ్చారా - రెండోచేతితో పట్టుకొని ?" అడిగింది రాణి, అద్దుర్దాగా.

"అవును" అన్నాడు మురళి, సవినయంగా.

భావాల బరువులు ఇద్దరి కంఠాలూ నొక్కేసినయి. తుదకి మురళి ఆశలతో కళ్ళెత్తి "రాణీ ! నీ ప్రేమభిక్షకై వచ్చాను. నన్ను దయతో చూడగలవా ?"

రాణి కళ్ళలో బాధ కనిపించింది. "ప్రేమ ఎంత ఘోరమైనదో తెలుసా ?" "తెలుసు. అనుభవించడానికైనా, అర్పించడానికైనా సుకృతం ఉండాలి. నీవే నాకు కనువిప్పు కలుగజేశావు" అన్నాడు మురళి స్వప్నంలోలా.

"ప్రేమ పావనమైనది మురళీ !" అంది రాణి నిమ్మళంగా. "నేను ధన్యురాలను. నీవు కోటీశ్వరుడవు, సకలైశ్వర్యవంతుడవు. ఎన్నో ఆశలు పెట్టుకున్నాను. నేను నీకు తిరిగియిచ్చిన బొగడదండకి-తెలుసు నా కలలన్నీ" అంది. మురళి చేతులు జోడించి కళ్ళు పైకెత్తి చూశాడు. రాణి కళ్ళల్లోవున్న అశ్రుబిందువు లతనిని ముగ్ధుణ్ణి చేశాయి.

"నీలాంటి ఉన్నతమైన జీవి నాకు దక్కడం నా అదృష్టం రాణీ. నాకున్న సర్వస్వమూ నీది. నన్ను వివాహమాడి నా భావి జీవితానికి రాణివి కమ్మని నా ప్రార్థన" అన్నాడు మురళి.

"వివాహమా!" అంది రాణి ఆశ్చర్యంగా. "ఒకప్పుడు అదే కలగా వుండేది. నేను, సుశీల ఎన్నోసార్లు అంతస్థుల భేదాలవల్ల పెళ్ళికి యెన్ని అవాంతరా లుంటాయో మాట్లాడుకునే వాళ్ళం. నా హృదయంలో దాగివున్న ప్రేమ సుశీలకి తెలిసిపోతుందేమోనని భయం వేసింది" అంది రాణి, ఏవో జ్ఞాపకాలు వల్లించుకుంటూన్నట్లు.

"అది నా మేనేజరు రవిని ప్రేమిస్తోంది. వాళ్ళిద్దరికి పెండ్లి ఏర్పాటు చేశాను" అన్నాడు మురళి.

"నన్నూ ఏదో మంచి యింటి కోడల్ని చెయ్యాలనీ, నన్ను బాగా చదివించాలనీ, ధనం లేకపోయినా—ఏదో ఒక విధంగా లోకానికి సేవ చేయించాలనీ ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు మా నాన్న. అవి ఈడేరకుండానే పోయారు. నాకూ అలాంటి ఆశలూ, ఆశయాలే వుండేవి" అంది రాణి, నెమ్మదిగా.

"ఇంతకీ నా మాటకి సమాధానం యిచ్చావుగావు. మన వివాహం ఎప్పుడు ఏర్పాటు చెయ్యమంటావు" అన్నాడు తిరిగి.

"వివాహం ఒక పవిత్రమైన ప్రక్రియ" అంది రాణి నిశ్చలంగా.

"అదిమానవకల్పిత ప్రక్రియే అనుకో. ఐనా నీవు నాదాన వవ్వాలంటే, ఆ పవిత్రత ఒక్కటే మార్గం" అన్నాడు చిరునవ్వుతో మురళి.

రాణి కా మాట సోకనే లేదు.

"తాలి!" అంది తనలో తానే అన్నట్టుగా.

"అదీ అవసరమైన ఒక బాహ్యచిహ్నమేగా!" అన్నాడు మురళి.

"వివాహం వ్యవస్థ. తాలి సాంప్రదాయం. అవును—ఇచ్చిన మాటే చాలు. అసలు స్త్రీ-పురుష సంబంధమే పరమ పవిత్రం మురళీ!" అంది రాణి, నిమ్మళంగా తల ఎత్తకుండానే.

"దట్ ఈజ్ ఆబ్సెల్యూట్లీ కరెక్ట్. అవును—సరే చెప్పు, మన పెండ్లి ఎప్పుడు యేర్పాటుచెయ్యమంటావు రాణీ?" అన్నాడు మురళి. "నాకు వివాహ ప్రాప్తి లేదు మురళీ. వివాహం పవిత్రమైన ప్రక్రియ. తాలి ధరించే భాగ్యం యీ జన్మకి లేదు. ఇక ఆ మాట అనవద్దు" అంది రాణి తలవంచుకుని. మురళి నిశ్చేష్టుడై పోయాడు.

ఒక క్షణంలో తెప్పరిల్లి "ఏం? ఎవరికైనా మాట యిచ్చావా?" అన్నాడు బాధగా, అనుమానంగా.

"ఎవరికీ యివ్వలేదు."

"మరి?"

"ఏమీలేదు. నేను మీ యింటి కొచ్చిన అ ఒక్కనాటి ఘట్టం నా కండ్లలో నన్నే నీచపరిచింది. మీరు స్త్రీలని అంత నీచపరుస్తారనీ, అవకాశం ప్రకారం హీనపరుస్తారనీ అనుకోలేదు. ఆనాడు నాకు భూమిబ్రద్దలయిన ట్లయింది. తరువాత నాకు ఆత్మహత్య చేసుకోవా లనిపించింది. కాని నేను యిల్లు చేరేటప్పటికి మా తండ్రి అంత్యక్రియలు జరపవలసివచ్చింది. పైగా మీ రుణం తీర్చవలసిన బాధ్యత ఒకటి నామీద వుండిపోయింది. అందువల్ల జీవచ్ఛవంలాగా బ్రతుకుతున్నాను. కాలయాపనయ్యాక చావాలన్న తీవ్రకాంక్ష తగ్గిపోయింది. ఇప్పుడు చావడం అనవసరం. కాని, జీవితంలో వెలుగులేదు. ఇలా యాత్ర గడవ వలసిందే."

కళ్ళనీళ్ళు జారుతూ వున్నాయి, చిక్కిన చెక్కిళ్ళమీద.

మురళి గాఢంగా, తీవ్రంగా అంతా విన్నాడు, ఏడుపు ఆపుకుంటూ.

"ఆనాడు ఏమీ జరగలేదు. రాణీ ! నీవు మూర్ఛబడిపోయావు. నేను చీదరించుకొని నిన్ను రిక్షాలో పంపివేశాను" అన్నాడు మురళి, నేరస్తుడు నిర్దోషినని చెప్పుకుంటున్నట్టు.

"ఆ మూర్ఛ నేను పడకపోతే ఏమై యుండును ?"

మురళికి నోట మాట రాలేదు. ముఖం చేతులతో కప్పుకున్నాడు. ఒక క్షణం అయిన తరువాత, "నీవు పతితవు కాలేదుగా" అన్నాడు.

మానసికంగా పతితనే ! నాన్న ప్రాణాలు దక్కించుకోవాలని నాకు డబ్బుకావాలన్నాను. కనుకనే ఆ మీ నియమానికి ఒప్పుకున్నాను. మూర్ఛపడకపోతే పాపం జరిగి ఉండునుగా ! భావంలో పాపం జరిగింది. క్రియలు ఘనీభవించిన భావాలే ! "నేను పతితనే మురళీ !" అంది రాణి బాధగా తల ఎత్తకుండా.

మురళి వెక్కి వెక్కి ఏడ్చాడు. "నా ఆశలు అన్నీ మంట కలిశాయి యీనాడు."

"నా ఆశలు ఆ నాడు యిలాగే బుగ్గి అయిపోయినాయి. నీ బాధ నాకు అర్థమైంది మురళీ."

ఒక్క అరగంట ఎవరూ ఏమీ మాట్లాడ లేదు.

మురళి "రాణీ ! నీ నిశ్చయం మార్చుకోలేవా ?"

"క్షమించు మురళీ ! నన్ను మర్చిపో."

రాణి కళ్ళల్లో నీళ్లు నిండాయి. మురళి తల పైకెత్తి చూశాడు. రాణి వొక్కక్షణంలో ముఖం దృఢపర్చుకుంది. ఇక ఆశలేదని గ్రహించిన మురళి, మారుమాటాడకుండా నిమ్మళంగా నిద్రలో లేచినట్టు బైట

కొచ్చాడు. మరుక్షణం రాణి కుర్చీలో కూలబడి మేజామీద తలపెట్టుకొని భోరున యేడ్చింది.

తెల్లవారుఝామున వెన్నెల కాస్తోంది. దొడ్లో బొగడచెట్టునుంచి తెల్లటి పువ్వులు రాలుతున్నాయి. జీవితం వ్యర్థం! రాణీలేని జీవితం దుర్భరం! పలుకకుండా, పలుకరించకుండా తలుపులు గడియవేసుకొని అలాగే కూర్చునేవున్నాడు, కుర్చీలో.

"బాబూ! కాఫీఅయినా తెమ్మంటారేమో అడగమన్నారు అమ్మ గారు" అని తలుపు కొట్టాడు రాముడు. మురళికి మతి వచ్చినట్లయింది. "వద్దు" అన్నాడు లోపల్నుంచి. మురళి కుర్చీలోనుంచి లేచాడు. ఇల్లంతా చీకటిగా వుంది. "ప్రేమ మరణమంత బలమైంది. అగాధజలములూ, అనేక వరదలూ దానిని ఆర్పలేవు." ఎవరీ మాట లన్నది? జ్ఞాపకం వచ్చింది. సొలోమాన్ మహాపురుషుడు.

తన కెవ్వరూ లేరనిపించింది. ఈ అనంతవిశ్వంలో తను వొక్కడే. తనకి ప్రేమించేవాళ్లు లేకపోవటం యెంత దుస్థితి! బాల్యంలో అమ్మవొడిలో తలపెట్టుకొని పడుకున్న తృప్తి, భద్రత జ్ఞాపకం వచ్చాయి. అన్నీ మరచిపోయి అమ్మ వొడిలో నిద్రపోదా మనిపించింది. తన వొంటరితనం యెవరితో చెప్పుకోవాలి? మరి యెవరున్నారు? ఎన్నడూలేనిది—ఎక్కడో వున్నాడన్న పరమేశ్వరుడిమీదికి తన మనస్సు మళ్ళింది. యుగ యుగాలక్రితంనుంచి అసహాయుడై, మాతృగర్భంలో, చీకటిలో చేతులు పైకెత్తి మోకాళ్ళమీద పడుకున్ననాటి—తనకి తెలియని అంతఃస్ఫురణ లేవో ఆదిమానవుడికి చెప్పినట్లు మురళికి చెప్పినయి. అతను స్వప్రయత్నం లేకుండా "పరమేశ్వరా!"అంటూ చేతులు జోడించి అదృశ్య విశ్వదాతకి మోకరిల్లాడు.

* * * *

గుమ్మంలో నుంచున్న సుశీలను చూడగానే రాణి ముఖంలో వెయ్యిభావాలు పొడగట్టినయి.

"మామయ్యకు చాలా సీరియస్‌గావుంది. నిన్ను వెంటనే పిల్చుకు రమ్మన్నాడు. ఏదో విషం త్రాగేశాడు" అంది సుశీల, గాబరాగా.

ఒక్క పరుగున ముకళి ప్రక్కమీద వ్రాలింది రాణి. జీవితమంతా దాచ ప్రయత్నించిన ప్రేమ పొంగుకొచ్చింది. "మురళీ ! నేను వచ్చాను." మురళి కళ్లెత్తి చూశాడు. గతం యేమీలేదు, దహించుకుపోయే ప్రేమ ఒక్కటేతప్ప.

"రాణీ ! నేను వెళ్ళిపోతున్నాను. డాక్టరువచ్చినా లాభంలేదు."

"మురళీ ! నేనూ బ్రతకలేను, నేనూ వచ్చేస్తాను."

"ఊఁ హు. వీలులేదు. చావడానికంటె బ్రతకడానికే ధైర్యం కావాలి. నీవు బ్రతికి వుంటానని, జీవితమంతా అనుకున్న ఆశయాలూ, మీ నాన్న కోరికలూ నెరవేరుస్తానని వాగ్దానం చెయ్యి. ఇప్పుడైనా నా మాట విను." అన్నాడు గద్గదస్వరంతో "నీలాగు అసహాయులైన స్త్రీలకు వసతులు ఉద్యోగాలు ఏర్పాటుచెయ్యి. సర్వస్వం నీపేరున విల్లు చేశాను, సుశీలకు కొంత తప్ప" అన్నాడు మళ్ళీ.

"నాకఠిన నియమాలకి నీవు ఆహుతి అవుతావా మురళీ ?" అంది ఏడుస్తూ.

"ఉన్నతాశయాలు ప్రాణాలకంటె విలువైనవి" అన్నాడు మురళి. కాస్త ఆయాసంతో "నీ జీవితంలో సుఖం చంపివేసిన ద్రోహానికి నేను చాలా పశ్చాత్తాప పడుతున్నాను. పశ్చాత్తాపానికి మించిన ప్రాయశ్చిత్తములేదు. నన్ను క్షమిస్తావా, రాణీ !"

"మురళీ ప్రేమ చావదు. జీవితంలో నీకు భార్యనయ్యే భాగ్యం నాకు లేకపోయింది. మృత్యువు సన్నిధిలో నీకు నేను వితంతువు నవు తున్నాను." అని నుదుటవున్న తన కుంకుమ తన చేతులతో తుడిచి వేసుకొంది. "నీ స్మరణతో. లోకసేవతో రోజులు గడుపుతాను!" అంది దుఃఖంతో.

ధైర్యసాహసాలకి అలవాటుపడ్డ రాణి లేచి బల్లమీద పటం ప్రక్కన వున్న వాడిపోయిన బొగడదండ తెచ్చి మురళి పాదాల వద్ద పెట్టింది.

ఈ నాడు తనదైన భవంతిలో నిమ్మళంగా నడచి దుఃఖం ఆపు కుంటూ, కిటికీవద్దకు వచ్చి ఊచలు పట్టుకొని బయటకు చూస్తూ నిల బడివుంది. వెనుకనుంచి సుశీల, అక్కయ్యల ఏడ్పులు వినిపిస్తూ వున్నాయి. అవును. "పశ్చాత్తాపానికి మించిన ప్రాయశ్చిత్తములేదు." అంది రాణి తనకు తానే. బయట తెల్లవారుఝాము వెన్నెల లలుము కొన్నవి. కాంపౌండులో బొగడ చెట్టునుంచి తెల్లటి పువ్వులు రాలుతూ వున్నాయి — వెన్నెల చినుకులలా — నిరంతర దుఃఖాగ్నిని క్రమింగి. కనుదోయి, విధిలేక జార్చే కన్నీటి చుక్కల లాగు.

* *
*